# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 13-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. పిఎం-కిసాన్ పథకం 22వ విడత నిధులను ఈరోజు విడుదల చేశారు.

- ప్రపంచ ప్రతికూలతలకు తగిన విధంగా ప్రతిస్పందించేందుకు ఆర్థిక స్థిరీకరణ నిధిని ప్రతిపాదించామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.

- దేశ ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఉద్ఘాటించారు.

- భారతీయ రైల్వేలు పనితీరును మెరుగు పరచుకునేందుకు అనేక ఉత్తమ విధానాలను అవలంభించాయని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అంకితమైందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. దేశవ్యాప్తంగా 9.32 కోట్ల మంది రైతులకు పిఎం-కిసాన్ పథకం 22వ విడతను విడుదల చేసిన అనంతరం గౌహతిలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. గత 11 సంవత్సరాలలో, బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని పెంచడానికి అనేక చర్యలు తీసుకుందన్నారు. వారి ఆదాయాన్ని పెంచడంతో పాటు వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించేలా నూతన చొరవలకు ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో అస్సాం ఇతర ఈశాన్య రాష్ట్రాలకు ఒక ఉదాహరణగా నిలుస్తోందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్...27 సెకన్లు)

ఈ సందర్భంగా ప్రధానమంత్రి సుమారు 19 వేల 680 కోట్ల రూపాయల విలువైన అనేక అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, జాతికి అంకితం చేశారు. రాష్ట్రంలోని అర్హులైన తేయాకు తోట కార్మికులకు ప్రధానమంత్రి వర్చువల్‌గా భూమి పట్టాలను అందజేసి, 150 మెగావాట్ల కోపిలి జలవిద్యుత్ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. అలాగే.. ఆయిల్ ఇండియా లిమిటెడ్ నుమాలిగఢ్-సిలిగురి ఉత్పత్తి పైప్‌లైన్ సామర్థ్యాన్ని పెంచే ప్రాజెక్టును కూడా జాతికి అంకితం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ ప్రతికూలతలకు తగిన విధంగా ప్రతిస్పందించేందుకు ప్రభుత్వం 57 వేల 381 కోట్ల రూపాయల ఆర్థిక స్థిరీకరణ నిధిని ప్రతిపాదించిందని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. లోక్‌సభలో ఈరోజు జరిగిన చర్చకు ఆమె సమాధానమిస్తూ.. వంట గ్యాస్‌తో సహా సప్లై చైన్ అంతరాయాలు, ఊహించని సంఘటనలను ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ సప్లిమెంటరీ డిమాండ్ ఫర్ గ్రాంట్స్ లో రక్షణ సేవలకు 41 వేల 430 కోట్ల రూపాయలు కేటాయించినట్టు తెలిపారు. మాజీ సైనికుల సహకార ఆరోగ్య పథకం (ECHS) కోసం అదనంగా 6 వేల 140 కోట్ల రూపాయలు అందిస్తున్నట్టు చెప్పారు. ఎరువుల సబ్సిడీల కోసం 19 వేల 230 కోట్ల రూపాయలు కేటాయించామని.. ఏప్రిల్ 1 నుండి అమలు చేయనున్న వికసిత్ భారత్ - G RAM-G చట్టానికి అదనంగా 30 వేల కోట్ల రూపాయలు కేటాయించామని ఆర్థిక మంత్రి పేర్కొంటూ..

(వాయిస్…20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని విదేశాంగ శాఖా మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఉద్ఘాటించారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఈరోజు ఆయన లిఖిత పూర్వకంగా సమాధానమిస్తూ.. దేశ భద్రత, ఆర్థిక ప్రయోజనాలకు భంగం కలిగించే విధంగా హిందూ మహాసముద్ర ప్రాంతంలో జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామన్నారు. హిందూ మహాసముద్ర ప్రాంతంతో సహా వివిధ దేశాలతో భారతదేశ సంబంధాలు వాటి సొంత పునాదిపై నిలుస్తాయని స్పష్టం చేశారు. పొరుగుదేశాలకు మొదటి ప్రాధాన్యత విధానం, తూర్పు దిశగా సాగరతీర విధానం, మహాసాగర్ దార్శనికతకు అనుగుణంగా భారతదేశం ప్రాంతీయ సహకారాన్ని బలోపేతం చేయడానికి తన భాగస్వాములతో కలిసి పనిచేస్తోందని జైశంకర్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

భారతీయ రైల్వేలు పనితీరును మెరుగు పరచుకునేందుకు అనేక ఉత్తమ విధానాలను అవలంబించాయని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఈరోజు ఆయన మాట్లాడుతూ.. భారత రైల్వేలు మొత్తం 77 శాతం సమయపాలన సాధించాయని పేర్కొన్నారు.  రైలు టైమ్‌టేబుల్‌లలో నిర్మాణాత్మక సమస్యలను గుర్తించి, పరిష్కరించేందుకు ఐటీ ఆధారిత వ్యవస్థలు, AI ఆధారిత విశ్లేషణతో సహా అధునాతన సాంకేతిక సాధనాలను ఉపయోగించామని చెప్పారు. దేశంలోని 24 రైల్వే డివిజన్లు 90 శాతం కంటే ఎక్కువగాను, 43 డివిజన్లు 80 శాతానికి పైగా సమయపాలన సాధించాయని తెలియజేస్తూ...

(వాయిస్…23 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ అస్సాంలోని కోక్రాఝర్‌లో 4 వేల 570 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి పనులను ఈరోజు ప్రారంభించారు. అస్సాం మాల 3.0 అనే రోడ్డు మౌలిక సదుపాయాల ప్రాజెక్టుకు, నాలుగు ఫ్లైఓవర్లకు, బిటిసి ప్రాంతంలో రెండు వంతెనలకు, కోక్రాఝర్ జిల్లాలోని బాస్బరిలో రైల్వే పీరియాడిక్ ఓవర్‌హాలింగ్ వర్క్‌షాప్‌కు వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా శంకుస్థాపన చేసి, 3 కొత్త రైళ్లను ప్రారంభించారు. రాష్ట్రంలో 36 కొత్త వంతెనలకు కూడా శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రధానమంత్రి గువహతి నుండి వర్చువల్‌గా మాట్లాడుతూ.. బోడో టెరిటోరియల్ కౌన్సిల్ ప్రాంత సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలోని ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఇంధనం సహా ఇతర సరుకులను అవరోధాలు లేకుండా రవాణా చేయడం కీలకమని భారత్.. ఇరాన్‌కు స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో ఇటీవలి పరిణామాలపై విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అంతర్-మంత్రిత్వ సమావేశంలో మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్రమోడీ నిన్న సాయంత్రం ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసౌద్ పెజెష్కియన్‌తో మాట్లాడారని చెప్పారు. ఇరాన్‌తో సహా ఈ ప్రాంతంలోని భారతీయ పౌరుల భద్రత, శ్రేయస్సుకు సంబంధించి మన దేశ ప్రాధాన్యతను తెలియజేశారని పేర్కొన్నారు. అన్ని సమస్యలను చర్చలు, దౌత్యం ద్వారా పరిష్కరించుకోవాలనే భారతదేశ స్థిరమైన వైఖరిని ఆయన పునరుద్ఘాటించారు.

= = = = = = = = = = = = = = = = = = =

ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తి దేశ చేనేత రంగాన్ని బలోపేతం చేసిందని కేంద్ర జౌళి శాఖా మంత్రి గిరిరాజ్ సింగ్ అన్నారు. రాజ్యసభలో కొన్ని అనుబంధ ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో 2015లో తొలిసారిగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు ప్రారంభించామని పేర్కొన్నారు. ప్రపంచంలోని చేనేత ఉత్పత్తులలో దాదాపు 95 శాతం భారత్‌లోనే ఉత్పత్తి అవుతున్నాయన్నారు. చేనేత రంగం మహిళల నేతృత్వంలో ఉన్న రంగం అని, ఇందులో దాదాపు 70 శాతం మంది మహిళలు పాల్గొంటున్నారని చెప్పారు. సమర్థ్ వంటి పథకాల ద్వారా కార్మికులకు నైపుణ్య శిక్షణతో పాటు ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయని గిరిరాజ్ సింగ్ వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ సహా వివిధ పెట్రోలియం ఉత్పత్తులను ప్రజలు వివేకవంతంగా ఉపయోగించాలని కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం దేశంలో వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిల్వలు తగినంత ఉన్నాయని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అయితే, మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న సంఘర్షణల కారణంగా అస్థిరత్వం నెలకొని ఉందని పేర్కొంది. ఈ అనిశ్చితి కారణంగా భవిష్యత్తులో సరఫరా అంతరాయాలు కలిగే అవకాశం ఉన్నందున వంట గ్యాస్, ఇతర పెట్రోలియం ఉత్పత్తులను జాగ్రత్తగా ఉపయోగించాలని మంత్రిత్వ శాఖ ప్రజలకు సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = =

గత సంవత్సరం ఆకస్మిక వరదలు, మొంథా తుఫాను, కొండచరియలు విరిగిపడిన ఘటనలతో ప్రభావితమైన రాష్ట్రాలకు ఒక వెయ్యి 912 కోట్ల రూపాయలకు పైగా అదనపు సహాయం అందించేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటి ఈరోజు ఆమోదం తెలిపింది. ఈ మొత్తంలో ఆంధ్రప్రదేశ్‌కు 341 కోట్ల రూపాయలు, ఛత్తీస్‌గఢ్‌కు 15 కోట్ల 70 లక్షల రూపాయలు, గుజరాత్‌కు 778 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =